క్లుప్తంగా

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

మురళీనగర్ : మురళీనగర్ రామాలయంలో వెలసిన శ్రీ లలితా దేవి ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 22 నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ సందర్భంగా శరన్నవరాత్రి మహోత్సవాల ఆహ్వాన పత్రికను ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యద ర్శులు టీఎస్ రెడ్డి, సనపల వరప్రసాద్, ఇతర సభ్యులు శనివారం ఆవిష్కరించారు. కార్యక్ర మంలో కమిటీ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సీతంపేట : స్థానిక అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌లో హెచ్ఎం జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో ఉపా ధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సం దర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయు లను సత్కరించి నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులంతా కలిసి హెచ్ఎం రాధాకుమారిని సత్కరించి జ్ఞాపిక బహూకరిం చారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, గ్లోరీ, శ్యామల, కిషోర్, ప్రభాకర్, ఎన్‌సీసీ ఆఫీసర్ విశ్వనాథం పాల్గొన్నారు.

జర్నలిస్టులకు సత్కారం

సీతంపేట : సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమని వాసవీ క్లబ్ వాల్తేర్ కపుల్స్ ప్రతినిధులు ఆర్.కె.ప్రసాద్, గ్రంధి సత్యవాణి అన్నారు. వాసవీ వీక్‌లో భాగంగా శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఉత్తమ జర్నలిస్టులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో సుదీర్ఘ అనుభవం కలిగిన బ్యూరో చీఫ్‌లు, జర్నలిస్టులు, ఫొటో జర్నలిస్టులు, డెస్కు జర్న లిస్టులు, మహిళా జర్నలిస్టులను సత్కరిం చడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమం లో క్లబ్ ప్రతినిధులు మద్దుల సునీల్ గుప్త, తవ్వ సంపత్, బొడ్డు రాజేష్‌బాబు, గ్రంధి రమేష్ పాల్గొన్నారు.

డ్రెయిన్ కల్వర్టు శిథిలం



శ్రీనగర్‌లోని రెడ్డి ఆస్పత్రి కూడలిలో ప్రమాదకరంగా డ్రెయిన్ కల్వర్టు

సీతంపేట : స్థానిక రామాటాకీస్ సమీపంలోని శ్రీనగర్ రోడ్‌లో రెడ్డి ఆస్పత్రి కూడలి వద్ద డ్రెయిన్‌పై వేసిన ఐరన్ గ్రిల్ తుప్పు పట్టి విరిగి పోయింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. విరిగిన డ్రెయిన్ కల్వర్టు వద్ద ప్రమాదాలు జరగకుండా స్థానికులు కొబ్బరి కమ్మను అడ్డుగా పెట్టారు. రోడ్డు మధ్యలో కల్వర్టు ప్రమాదకరంగా మారడంతో వారం రోజులుగా ఇబ్బంది పడుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే మార్గంలో త్వరితగతిన డ్రెయిన్‌పై కొత్త గ్రిల్ ఏర్పాటు చెయ్యాలని స్థానికులు కోరుతున్నారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

మద్రిపాలెం : భార్య కనిపించడం లేదంటూ భర్త కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఊర్వశి దరి గౌరీనగర్ ప్రాంతంలో భార్య దివ్య, కుమార్తెతో కలిసి జి.శ్రీను నివసి స్తున్నాడు. శ్రీను సెక్యూరిటీ గార్డుగా పని చేస్తుండగా దివ్య ఇంటి పనులు చేస్తుండేది. ఈ క్రమంలో ఈ నెల 4న శ్రీను రోజూ మాదిరి డ్యూటీకి వెళ్లిపోయాడు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల సమయంలో అతని సోదరుడు ఇంటికి వెళ్లగా ఇంట్లో ఎవరూ లేకపోవడంతో శ్రీనుకు ఫోన్ చేశాడు. వెంటనే దివ్యకు శ్రీను ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడం తో అంతటా వెతికినా ఆచూకీ లభించలేదు. కంచరపాలెం పోలీసులను ఆశ్రయించడంతో శ్రీను ఫిర్యాదు మేరకు సీఐ రవికుమార్ నేతృ త్వంలో హెడ్ కానిస్టేబుల్ అబద్దం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వరాహగిరికాలనీలో నడిచేందుకు వీల్లేని రహదారి



వరాహగిరికాలనీ-1లో శిథిలమైన డ్రైనేజీ

దారుణ దారులు.. శిథిల డ్రైనేజీలు

- దుస్థితిలో కొండవాలు ప్రాంతంలోని సత్యసాయినగర్, వరాహగిరికాలనీ
- ఎన్నేళ్లయినా బాగుపడని రోడ్లు, డ్రైనేజీలు
- కనీసం పట్టించుకోని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



సత్యసాయినగర్‌లో శిథిలమైన ప్రధాన రహదారి

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు కొండవాలు ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కరవయ్యాయి. సత్య సాయినగర్, వరాహగిరికాలనీ-1,2, సింహగిరికా లనీ, సింగాలమ్మపురం కాలనీలు జీవీఎంసీ 45వ వార్డు పరిధిలోకి వస్తాయి. అదే సమయంలో ఈ కాలనీలు భీమిలి నియోజకవర్గంలోనూ ఉన్నాయి. ఈ కారణంగా భీమిలి ఎమ్మెల్యేలు ఈ కాలనీలను పట్టించుకోవడం మానేశారు. ముఖ్యంగా కొండ వాలు పరిధిలోని వరాహగిరికాలనీ-1,2లలో సరైన రోడ్లు లేవు, డ్రైనేజీ వ్యవస్థ లేదు. రోడ్లు, మెట్ల మార్గాలు దాదాపు దశాబ్దం క్రితం నాటివి కావడం తో అవన్నీ శిథిలమైపోయాయి. అలాగే వరాహగి రికాలనీ-1, 2లలో డ్రైనేజీ వ్యవస్థ కూడా శిథిలా వస్థకు చేరుకుంది. ఈ కారణంగా ఈ ప్రాంత ప్రజలు తరచు అనారోగ్య సమస్యలతో బాధపడు తున్నారు. మరోపక్క దోమల వ్యాప్తి వంటి సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. చీకటి పడితే పిల్లలు, వృద్ధులు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా రోడ్డు పక్కనే ఉన్న శిథిల డ్రైనే జీలలో పడాల్సిందే. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సత్యసాయినగర్‌లో రోడ్లు, డ్రైనేజీలు, డ్రైనేజీల పైకప్పులు వేసి పలు అభివృద్ధి పనులు పూర్తి చేశారు. కానీ తర్వాత వచ్చిన కూటమి ప్రభుత్వం తన 14 నెలల పాలనలో ఒక్కటంటే ఒక్కటి కూడా అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేదు. ఇక్కడ కనీసం శంకుస్థాపన కూడా చేయలేదు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు భీమిలి నియోజ కవర్గ పరిధిలోని సమీప ప్రాంతాల్లో లక్షల రూపా యల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ ప్రాంతాలను మాత్రం పూర్తిగా మరిచిపో యారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఇక్కడి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్ల పరిస్థితి దారుణం

మా ప్రాంతంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉం ది. చాలా కాలంగా ఇలానే ఉన్నాయి. గతంలో సత్యసాయినగర్‌లో అక్కడక్కడా రోడ్లు వేశారు. మా ప్రాంతంలో కూడా రోడ్లు వేస్తామన్నారు. కానీ ఇప్పటి వరకు వేయలేదు. దీంతో ఈ దారులపై ప్రయాణాలు సాగించేందుకు నిత్యం ఇబ్బందులు పడుతున్నాం.

– ఎస్.రామారావు, వరాహగిరికాలనీ

శిథిలావస్థలో డ్రైనేజీలు

వరాహగిరికాలనీ-1లో గల ప్రతి వీధిలోను డ్రైనేజీలు శిథిలమైపోయాయి. వీటిని నిర్మించి దాదాపు పదేళ్ల కంటే కూడా ఎక్కువ కాలం అయి ఉంటుంది. అప్పటి నుండి ఇలానే వదిలేశారు. కనీసం మరమ్మతులు లేవు. కొత్తవి నిర్మించలేదు. దీంతో ఈ ప్రాంతంలో ఎక్కడిక క్కడ డ్రైనేజీ నీరు నిల్వ ఉండడం, దోమల వ్యాప్తి జరుగుతోంది. ఇప్పటికైనా మా ప్రాం తాల్లో డ్రైనేజీలు, రోడ్లు బాగు చేయాలని కోరు తున్నాం.

– రామకృష్ణ, సత్యసాయినగర్

ఘనంగా గణేష్ నిమజ్జనాలు



నిమజ్జన కార్యక్రమంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మహేష్‌రెడ్డి, గుజ్జు వెంకటరెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి



గణపతిని రథంపై తరలిస్తున్న కమిటీ సభ్యులు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు 104 ఏరియా బీఆర్‌టీఎస్ ప్రధాన రహదారిలో రాష్ట్ర అటవీ శాఖ మాజీ డైరెక్టర్, వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో వేమన యూత్ అసోసియేషన్ 25 వసంతాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వినాయక నవరాత్రి ఉత్సవాలు శనివారంతో ఘనం గా ముగిశాయి.

ముఖ్య అతిథులుగా వేమన సంఘం అధ్యక్షుడు జి.మహేష్‌రెడ్డి, మాజీ చైర్మన్ సత్తి రామ కృష్ణారెడ్డి పాల్గొని గణేషుని దర్శించుకుని పూజలు చేశారు. స్వామి వారి ఉత్సవ రథాన్ని ప్రారంభిం చారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలు, నేల వేషా లతో వినాయకుడిని ఊరేగించారు. అనంతరం ఆర్‌కే బీచ్‌లో గణపతిని నిమజ్జనం చేశారు. కార్యక్ర మంలో సంజీవరెడ్డి, బాకి శ్యామ్‌కుమార్‌రెడ్డి, ఎం ఈఎస్ బిల్డింగ్స్ అసోసియేషన్ ఆలిండియా వైస్ ప్రెసిడెంట్ బాల సతీష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు దివాకర్, గుజ్జు ధీరజ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, శంకరరెడ్డి, రాజారెడ్డి, రమేష్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పోతన్న, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆటోవాలాలను ప్రభుత్వమే ఆదుకోవాలి

- 11న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి
- ఏఐటీయూసీ నాయకుడు పడాల గోవింద్



ఆటో కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న పడాల గోవింద్

మద్దిలపాలెం: ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఆదాయం కోల్పోయిన ఆటో డ్రైవర్లను తక్షణమే ఆదుకోవాలని ఏఐటీయూసీ, ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్ కోరారు. పలు డిమాండ్లతో ఈ నెల 11న తలపెట్టిన ఆటోవాలాల చలో కలెక్టరేట్ కార్యక్ర మాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, ఏఐటీ యూసీ విశాఖ జిల్లా ఆటో యూనియన్ ముఖ్య నాయకుల సమావేశం మద్దిలపాలెం కృష్ణ కాలేజీ రోడ్డులో గల కార్యాలయంలో శనివారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ఉచిత బస్సు ప్రయాణం కల్పించి ఆటోవాలాలకు ఆర్థికంగా నష్టం కలిగిస్తోందన్నారు. ఆదాయం కోల్పోయిన ఆటో డ్రైవర్లను తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఓలా, ఉబర్, రాపిడో ఆన్‌లైన్ బుకింగ్ యాప్‌ల నుంచి టూ వీలర్లను వెంటనే తొలగించాలని కోరారు. వాహన మిత్ర పథకం అమలు చేసి రూ.15 వేలను బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని, ఆటో అండ్ మోటార్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. వాహనాల మీద అధిక జరిమా నాలు విధించే జీవో నంబర్ 21, 31ని వెంటనే సవ రించాలని కోరారు. పలు డిమాండ్లతో ఈ నెల 11న జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి కలెక్టర్ కార్యా లయం వరకు ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించను న్నామని, అందరూ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మధురెడ్డి, దల్లి నాని, షేక్ బాషా, కృష్ణ నాయుడు, శ్రీనివాస్, చంటి పాల్గొన్నారు.

ట్రంప్ సుంకాలపై కూటమి వైఖరి స్పష్టం చేయాలి

వామపక్ష పార్టీల డిమాండ్



నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల ప్రతినిధులు

టీచర్స్‌రోడ్డు: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆ దేశంలో భారతీయ సరకుల దిగుమతిపై 50 శాతం సుంకాలు విధించడాన్ని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తూ, ట్రంప్ సుంకాలను తక్షణం రద్దు చేయాలని, సుంకా లపై మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తమ వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశాయి. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. రహిమాన్, సీపీఐ (ఎం) జిల్లా కార్య దర్శివర్గ సభ్యులు పి.మణి తదితరుల ఆధ్వర్యంలో ట్రంప్ సుంకాలను వ్యతిరేకిస్తూ శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భం గా రహిమాన్, మణి మాట్లాడుతూ అమెరికా విధిం చిన సుంకాల వల్ల భారతీయ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. మోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఎం. పైడిరాజు, వామపక్ష పార్టీల నాయ కులు ఎం.సుబ్బారావు, ఎం.మన్మథరావు, కె. దేవా, సీఎస్ క్షేత్రపాల్, ఎంఎస్ పట్నాయిక్, కె. సత్యనారా యణ, జీవీఎం రెడ్డి, ఎండీ బేగం, కొండమ్మ, కె. వనజాక్షి, వెంకటరావు, ఎ. దేముడమ్మ, వై. రాంబా బు,ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బల్లిగిరికి పోటెత్తిన భక్తులు

అల్లిపురం: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు శనివారం భక్తులు పోటెత్తారు. ఏడు శనివారాల వ్రతం చేసే భక్తులు శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి తిరువీధి ఉత్సవం తో పాటు ఆలయ పరిక్రమణ అత్యంత వైభవంగా చేపట్టారు. భక్తులు స్వామితో పాటు దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఏడు పిండి దీపాలు వెలిగిం చి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చ కుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, అర్చనలు జరిగాయి.

51వ వార్డులో అన్నసమారాధన



అన్నప్రసాదం వడ్డిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్రిపాలెం : గణనాథుని ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 51వ వార్డు పరిధి సీతన్న గార్డెన్స్‌లోని ప్రిన్స్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ప్రారంభించారు. భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు.

వేడుకగా దీపారాధన



రెడ్డి కంచరపాలెంలో దీపారాధన చేస్తున్న కర్రి రామారెడ్డి, మహిళలు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు రెడ్డి కంచర పాలెం సన్‌రైజ్ క్లబ్ వద్ద భారత్ పుత్ర అసోసియేషన్ సభ్యులు, మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి ఉత్సవాల్లో భాగంగా శనివారం దీపా రాధన నిర్వహించారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్య క్షుడు కర్రి రామారెడ్డి హాజరై గణపతిని దర్శిం చుకుని పూజలు చేసి దీపాలు వెలిగించారు. కార్యక్ర మంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సీరపు దివాకర్ రెడ్డి, రాంబాబు, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, రఘురామ్, ఆర్.రాజు, గురునాథ్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి తులసిపూజ

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహా లక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచా మృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వ హించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి



ఆరిలోవలో పాదయాత్ర చేస్తున్న సీపీఎం నాయకులు

ఆరిలోవ: విశాఖ స్టీల్‌ప్లాం ట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యు రాలు పి.మణి డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీక రణకు వ్యతిరేకంగా ఆరిలో వలో సీపీఎం నాయకులు శని వారం పాదయాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె పార్టీ నాయ కులతో కలిసి ఆరిలోవ, రవీంద్రనగర్, ఆదర్శనగర్ వరకు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను 46 విభాగాలుగా విడగొట్టి ఒక్కొక్కటిగా ప్రైవేట్‌పరం చేస్తున్నారన్నారు. ఇప్పటికే 5 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను విధుల నుంచి తొలగించేయడం అన్యాయమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటానికి మద్దతుగా ఈ నెల 11న పాతగాజువాక కూడలిలో బహిరంగ సభ నిర్వహించనున్నామని తెలి పారు. ఈ సభ ను ప్రజలు, స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు జయప్రదం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు న రేంద్ర కుమార్, రమణ, వెంకటరావు పాల్గొన్నారు.

వైభవంగా సుప్రభాత సేవ

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెల సిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్ర భాత సేవ నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల నిర్వహించి సుప్రభాతం చదివి విని పించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యం లో 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాస నం, తీర్థ ప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజ భోగ నివేదన చేశారు. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా 300 మంది భక్తులకు అన్నసమా రాధన చేశారు. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర హారతి, కర్పూర హారతి, కూష్మాండ హారతి, కుంభ హారతి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

11 గంటల వరకే దర్శనాలు

వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో చంద్రగ్ర హణం సందర్భంగా భక్తులకు ఆదివారం సాయం త్రం దర్శనాలు నిలిపివేస్తామని ఈవో బండారు ప్రసాద్ తెలిపారు. ఉదయం 11 గంటల వరకే దర్శ నాలు కల్పిస్తామని, అనంతరం నిలిపివేస్తా మన్నారు. సోమవారం ఉదయం 5.30 నుంచి ఆలయ సంప్రోక్షణ చేస్తామన్నారు. అనంతరం ఉదయం 10 గంటల నుంచి వైభవుడి దర్శనాలకు భక్తులను అనుమతిస్తామని చెప్పారు.

సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ



లలితాపీఠంలో సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ చేస్తున్న భక్తులు

సీతంపేట : అక్కయ్యపాలెంలోని శ్రీలలితా పీఠంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు స్వామి వారిని, ఉత్సవమూర్తులను విరజాజులు, గులా బీలు, కనకాంబరాలతో చూడ ముచ్చటగా అలంక రించారు. పరిసర ప్రాంత భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు చేశారు. ఉదయం సుప్రభాత సేవ, సాయంత్రం భక్తులు సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ చేశారు. అనంతరం విశేష హారతులిచ్చారు.

- చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి పీఠంలో లలిత అమ్మవారి దర్శనంతో పాటు, ఉప ఆలయాల దర్శనాలను నిలిపి వేస్తున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. సంప్రోక్షణ అనం తరం సోమవారం ఉదయం 11 గంటల నుంచి దర్శనాలు కల్పిస్తామన్నారు. భక్తులు ఈ విష యాన్ని గమనించి సహకరించాలని కోరారు.

కాళీ కాలభైరవ కల్యాణ మహోత్సవం నేడు



శ్రీలలితా పీఠంలో కొలువైన కాళీకాలభైరవులు

సీతంపేట : పౌర్ణమి సందర్భంగా ఆదివారం ఉదయం 9:30 గంటలకు శ్రీలలితాపీఠంలో కాళీ కాలభైరవ కల్యాణ మహోత్సవం నిర్వహించను న్నామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలి పారు. శ్రీలలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి స్వామి ఆశీస్సులతో ఏటా భాద్రపద పౌర్ణమి నాడు కాళీ కాలభైరవుల కల్యాణం జరిపిస్తున్నట్టు తెలి పారు. అనంతరం మధ్యాహ్నం 12:30 గంటలకు అన్నప్రసాదం పంపిణీ చేస్తామని తెలిపారు. అలాగే చంద్రగ్రహనాన్ని పురస్కరించుకుని దోష పరి హారం కోసం సోమవారం ఉదయం గ్రహణ శాంతి హోమం నిర్వహిస్తామని తెలిపారు. కల్యాణం, హోమంలో పాల్గొనదలచిన భక్తులు పీఠం కార్యాల యంలో సంప్రదించాలని కోరారు.

బహుముఖ ప్రజ్ఞావంతుడు నాగేశ్వరరావు



డాక్టర్ నాగేశ్వరరావును సత్కరిస్తున్న ఉమామహేశ్వరరావు, తదితరులు

సీతంపేట: స్వరసామ్రాట్ నాగేశ్వరరావు కల్చరల్ అండ్ సోషల్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కమ ర్షియల్ ట్యాక్స్ విభాగంలో అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్‌గా పదవీ విరమణ చేసిన డాక్టర్ ఎ.వి. నాగేశ్వరావును ఘనంగా సత్కరించారు. ద్వారకాన గర్ పౌర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏయూ మాజీ రిజిస్ట్రార్ వెలగపూడి ఉమామహే శ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై నాగేశ్వరరావును దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నటుడిగా, గాయకుడిగా రాణించడమే కాకుండా, ఉద్యోగ రీత్యా కమర్షియల్ ట్యాక్స్ విభాగంలో అత్యున్నత స్థాయి అధికారిగా పదవీ విరమణ చేసిన నాగేశ్వరరావు బహుముఖ ప్రజ్ఞావంతుడని కొనియాడారు. ఆయన శేష జీవితం ఆనందమయం కావాలన్నారు. ఈ సందర్భంగా సి.హెచ్.వి.సత్యనారాయణ సారథ్యంలో సంగీత విభావరి నిర్వహించారు. సన్మాన గ్రహీత ఏవీనాగేశ్వ రరావుతో పాటు గాయనీ గాయకులు సినీగీతాలను మధురంగా ఆలపించారు. ఈ కార్యక్రమంలో సీటీవో శ్రీలక్ష్మి, యూనియన్ నాయకులు కన్నా సాహెబ్, విశ్రాంత సీటీవో పాత్రుడు, డాక్టర్ ఎ.కా ర్తీక్, కొణతాల రాజు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, పి.రాజేంద్రప్రసాద్, వివిధ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

భద్రతా పనులను పర్యవేక్షించిన డీఆర్ఎం



భద్రతా పనులను పర్యవేక్షిస్తున్న డీఆర్ఎం లలిత్‌బోహ్రా

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ రైల్వే మేనేజర్ లలి త్‌బోహ్రా డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతా పనులను రాత్రి వేళల్లో సైతం స్వయంగా పర్యవేక్షిం చారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా రాత్రి 11 గంటల తర్వాత రైళ్ల రాకపోకలు తక్కు వగా ఉన్న సమయంలో ఈ పనులను ప్రారంభిం చారు. పెందుర్తి-సింహాచలం పరిధిలో చేపట్టిన బలాస్ట్ క్లీనింగ్ మెషీన్ పనితీరును వీక్షించి, సిబ్బం దిని ప్రోత్సాహించారు. నిర్దేశించిన సమయంలో పనులను విజయవంతంగా పూర్తి చేయగలిగారు. ఈ బలాస్ట్ క్లీనింగ్ మెషీన్ తనంతట తానుగా ట్రాక్ నిర్వహణను తెలుసుకుంటూ, అవసరమైన ప్రాం తాల్లో ట్రాక్‌లపై రాళ్ల సరైన పరిమాణంలో సర్దు బాటు చేస్తుంది. మట్టితో కూడిన రాళ్లను తొలగించి శుభ్రపరుస్తుంది.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమావేశం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళా శాలలో శనివారం పూర్వ విద్యార్థులు సమావేశమ య్యారు. కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ఈ సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు తమ తమ రంగాల్లో సాధించిన విజయాలు కళాశా లకు గర్వకారణమన్నారు. పూర్వ విద్యార్థుల విజ యాలు ప్రస్తుత విద్యార్థులకు మార్గదర్శకంగా ఉం డి, కళాశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు ఐసీ ఐసీఐ బ్యాంక్ చీఫ్ మేనేజర్ బి.మణిమాల, డిప్యూటీ తహసీల్దార్ ఎం.సువర్ణ, ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు కె.నాగమణి ఇతర పూర్వ విద్యార్థులు కళాశాలలో తమ అనుభ వాలను గుర్తు చేసుకుని, తమ విజయాలు పంచు కోవడంతో పాటు కళాశాల అభివృద్ధికి భవిష్యత్‌లో చేపట్టబోయే ప్రణాళికల గురించి చర్చించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, బోటనీ విభాగం అధ్యాపకురాలు టి.నివేదిత, కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ కె.గీతాంజలి, డాక్టర్ ఆర్.కిరణ్మయి, డి. అరుణపద్మ తదితర అధ్యాప కులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.